# లోక్‌సత్తా పార్టీ

## జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్‌లకు అవగాహనాపత్రం

2006,
డిశంబరు 14, 15
హైదరాబాద్

## I ప్రజాస్వామ్యం-మౌలిక అంశాలు

నిజమైన ప్రజాస్వామ్యంలో ఐదు అంతర్భాగాలుండాలి. అవి. వ్యక్తి స్వేచ్ఛ **(freedom)** ; స్వపరిపాలన **(self-governance)** ; పౌరులకు పాలనలో నిరంతరం భాగస్వామ్యాధికారం **(empowerment)** ; చట్టం అందరికీ శిరోధార్యంగా ఉండటం **(Rule of law)** ; రాజ్య వ్యవస్థలో స్వయం పరివర్తనాశక్తి **(Self -correcting institutions)** ఈ అయిదింటి దృష్ట్యా మన ప్రజాస్వామ్యానికి విలువ కట్టినట్లయితే మనకు పరిస్థితి విశదమవుతుంది. అంతకు మించి, లోపాలు ఏ దిశలో వున్నాయో తెలిస్తే, పరిష్కారాలు అన్వేషించటం సాధ్యమౌతుంది. మన అవగాహన కోసం దీనిలోని ప్రతికొలమానంలో సున్న నుండి నూరు మార్కులు ఉన్నాయని ఊహించి, మన ప్రజాస్వామ్యనికి ఆయా అంశాలలో ఎన్ని మార్కులు వస్తాయో అంచనా వేద్దాం.

## స్వేచ్ఛ (Freedom)

వ్యక్తి స్వేచ్ఛ **(freedom)** ప్రజాస్వామ్యానికి ప్రాణం, స్వేచ్ఛ అంటే ప్రతి పౌరుడికి తనకిష్టమయిన పనిచేసే హక్కు ఉండడం అయితే సమాజంలో ప్రతి ఒక్కరు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే చాలా సందర్భాలలో ఇతరులకు ఇబ్బంది కలిగి, సమాజం చిన్నాభిన్నం కావచ్చు. కాబట్టి ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రతి వ్యక్తి స్వేచ్ఛకు కొన్ని హేతుబద్ధమైన పరిధులు లేక అడ్డుగోడలు ఉండాలి. వ్యక్తి స్వేచ్ఛలో ఎన్నో హక్కులు ఇమిడి ఇన్నాయి. భావ ప్రకటనల హక్కు, ఎక్కడికయిన వెళ్ళే హక్కు, ఎక్కడయినా నివసించే హక్కు, కొందరు కలసి ఒక సంఘం ఏర్పరచుకునే హక్కు, మతస్వేచ్ఛ, వృత్తిస్వేచ్ఛ మొదలైన హక్కులన్నీ వ్యక్తి స్వేచ్ఛలో అంతర్భాగమే. మనదేశంలో స్వేచ్ఛరీత్యా ప్రజాస్వామ్యాన్ని అంచనా వేస్తే, మన పరిస్థితి గర్వకారణంగానే ఉంటుంది. ప్రపంచంలో దాదాపు ఎవరికీ తీసిపోని స్థాయిలో మనకు స్వేచ్ఛ ఉంది. అయితే, ఆచరణ రీత్యా, స్వేచ్ఛననుభవించటంలో కొన్ని అవాంతరాలు మనకున్నాయి. దుర్భర దారిద్ర్యం వలన స్వేచ్ఛకు శృంఖలాలున్నాయి. అధికారంలో ఉన్న వాళ్ల ఆగడాలను ఎదుర్కోటానికి తగిన ఏర్పాటు లేకపోవటం వలన ఎంతో మంది స్వేచ్ఛకు అవరోధం ఉంది. న్యాయం సకాలంలో అందే పరిస్థితి లేకపోవడం వలన కొన్ని సందర్భాలలో స్వేచ్ఛ ఎండమావిలా అందకుండా పోతోంది. ప్రభుత్వంలో ఏం జరుగుతున్నదో తెలుసుకునే హక్కు లేకపోవడంతో పౌరుల స్వేచ్ఛకి సంకెళ్లు పడుతున్నాయి. అయితే ఇలాంటి అవరోధాలున్నప్పటికీ మొత్తం మీద నిష్పాక్షికంగా పరిశీలిస్తే స్వేచ్ఛ విషయంలో మన ప్రజాస్వామ్యానికి మంచి మార్కులే వస్తాయి. మన కొలమానంలో స్వేచ్ఛకి కనీసం నూటికి 60 మార్కులు వస్తాయి. కొన్ని స్వేచ్ఛల విషయం నూటికి 80 నుండి 90 మార్కులు మనం వేసుకోవచ్చు.

## స్వపరిపాలన (Self-governance)

స్వపరిపాలన అంటే పౌరులకు తమను తాము ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పరిపాలించుకునే హక్కు. ఈ అంశంలో మన పరిస్థితి సందిగ్ధంగా ఉంది. లోపభూయిష్టం అయిన ఎన్నికల తతంగమే స్వపరిపాలన అయితే మనం మంచి మార్కులు వేసుకోవచ్చు. కాని వాస్తవానికి దీనిలో ఎన్నో లోపాలున్నాయి. 1947లో జరిగింది. చాలా వరకు వలస ప్రభువుల నుండి మన ప్రభువులకు అధికారం మార్పిడి మాత్రమే. దొరలు పోయారు గాని నిజానికి దొరతనం పోలేదు. ఆనాటి పరిస్థితుల్లో ఎలాగోలా దేశ ఐక్యతని, శాంతిభద్రతలని కాపాడాలన్న ఆతృతతో మన నేతలు కేంద్రీకృతం అయిన పాలనా వ్యవస్థని, అధికార వర్గాల ప్రజాస్వామ్యాన్ని పెద్దగా మార్పులు లేకుండా కొనసాగించారు. దానితో పౌరుల పాత్ర మన పాలనలో నామమాత్రం అయిపోయింది. మన అధికార వ్యవస్థనూ, ఇతర సంస్థలను అలవాటు పడిన కారణంగా కొనసాగించారు. దానితో పౌరుల పాత్ర తమ పాలనలో నామమాత్రం అయిపోయింది. అధికార వ్యవస్థనూ, ఇతర సంస్థలను అలవాటు పడిన కారణంగా కొనసాగించాము. కాని, ప్రజాస్వామ్యానికనుగుణంగా స్వపరిపాలన సార్థకమయ్యేలా రూపొందించుకోలేదు. లోపభూయిష్టమైన ఎన్నికల ప్రక్రియ; పౌరులకు సరైన నిర్ణయాధికారం లేకుండా దొందూ దొందే అనే రకమైన అభ్యర్థుల పోటీలు; నిరంకుశంగా, స్వంత ఆస్తుల మాదిరిగా నడుస్తున్న రాజకీయ పార్టీలు; ఒకసారి ఎన్నికయ్యాక ప్రజలకు జవాబుదారీగా లేకుండా యధేచ్ఛగా వ్యహరించే అవకాశం ఉన్న ప్రభుత్వాల నేతలూ; మంచివాళ్లని, సమర్థులని దూరం చేసి డబ్బుకి, కండబాలనికి పెద్దపీట వేసే రాజకీయ ప్రక్రియ; అధికార లాలస తప్ప , ప్రజా సంక్షేమం నామమాత్రమైన పాలనా వ్యవస్థ; ఇవన్నీ మన స్వపరిపాలనను కళంకితం చేశాయి. ఎన్నిసార్లు

ఎన్నికలు జరిగినా, ప్రభుత్వాలు మారినా, కొందరు ఓడి మరికొందరు గెలిచినా, చివరకు పౌరులు నిరంతరం దుర్భరమైన ఓటిమినే చవి చూస్తున్నారు. దాంతో ఎన్నికలున్నా స్వపరిపాలన మధ్యగా మిగిలిపోయింది. మన కొలమానంలో స్వపరిపాలనకు నూటికి 25 మార్కుల కంటే రావడం కష్టం. ఇది నిజమైన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.

## పౌరుల భాగస్వామ్యాధికారం (Empowerment)

భాగస్వామ్యాధికారం **(Empowerment)** అంటే నిరంతరం పాలనలోపౌరులకు పాత్ర ఉండి పాలనా నిర్ణయాలను, పౌరులే ప్రత్యక్షంగా వీలైన చోట్ల తీసుకోగలగటం, లేదా పరోక్షంగా ప్రభావితం చేయగలగటం. కేంద్రీకృతమయిన అధికారస్వామ్యంలో పౌరులపాత్ర పాలితులుగా మాత్రమే. పాలనలో భాగస్వామ్యం, అధికారం పౌరులకు శూన్యం. చివరకు స్థానిక విషయాలు కూడా పౌరుల పాత్ర లేకుండా నిర్ణయమౌతున్నాయి. అనుభవం, అవసరం ఎక్కడున్నాయో నిర్ణయాధికారం అక్కడ లేకపోవడంతో ప్రజాస్వామ్యం అపహాస్యమై, ప్రజావసరాలు తీరటంలో తీవ్ర వైఫల్యం కలుగుతోంది. స్థానిక పాఠశాల, ఆసుపత్రి, రేషన్‌షాపు, నీరు, మురుగుకాల్వలు వీటన్నిటిలో పౌరుల పాత్ర చేయిచాచి అర్థించటమే తప్ప, ప్రజాస్వామ్యంలో ప్రభువులుగా, పన్ను చెల్లించే పౌరులుగా, డబ్బిచ్చే వినియోగదారులుగా పౌరులకేమీ పాత్రలేదు. ఉదాహరణకి విద్యుత్తు, టెలిఫోను లాంటి సౌకర్యాల విషయంలో కూడా పౌరుడి పాత్ర డబ్బిచ్చి, చేయిచాచి అర్థించటానికే పరిమితం. పౌరుడు వినియోగదారుడని, పన్నులు చెల్లించేవాడని, అతడి కోసం మొత్తం పాలనా యంత్రాంగం వున్నదని మన వ్యవస్థలో గుర్తింపేలేదు. అధికార యజ్ఞంలో పౌరులు సమిధలే తప్ప పాత్రధారులు కారు. నాయకులు, ప్రభుత్వోద్యోగులు ప్రజలకు సేవకులుగా కాక ప్రభువులుగా మారారు. పౌరుల్ని బానిసలుగా మార్చారు. పాలనా పద్ధతులు ప్రజలకేమీ అర్థం కాకుండా, వారి పాత్ర లేకుండా, పాలకుల సౌకర్యం కోసం మాత్రమే ఏర్పాటయ్యాయి. దాంతో, భాగస్వామ్యాధికారం విషయంలో మన ప్రజాస్వామ్యానికి వచ్చే మార్కులు నూటికి 5 లేదా 10 కి మించవు. ఇది నిజమైన ప్రజాస్వామ్యంలో అనూహ్యమైన, మనం లజ్జతో కృశించవలసిన పరిణామం.

## చట్ట శిరోధార్యత (Rule of law)

చట్టం అందరికీ శిరోధార్యంగా ఉండటం **(Rule of law)** అంటే నిజానికి పాలించేది అందరికీ సమానంగా వర్తించే చట్టమే కావాలి. ఎంతటి సంపన్నులయినా , ఉన్నతాధికారులైనా, చట్టం ముందు సామాన్యుడితో సమానం కావాలి. ఇది ప్రజాస్వామ్యానికి మూలాధారం. నిరంకుశ ప్రభువుల చిత్తం వచ్చినట్లు పాలన జరగకుండా, పుట్టుకతో, హోదాతో, సంపదతో నిమిత్తం లేకుండా అందరికీ సమానహక్కులు, పాలనలో అందరినీ సమానంగా చూడడం - ఇవి చట్టాల పాలనకు ఆధారం. మనదేశంలో అన్ని పాలనా వ్యవస్థలు చట్టమే శిరోధార్యమని నిరంతరం ఉద్ఘోషిస్తాయి. కాని వాస్తవానికి అనుభవంలో చట్టం సామాన్యులకొకటి , అంతస్తు, హోదా, అధికారం ఉన్నవారికి మరొకటి . ప్రభుత్వం నుండి వచ్చే లైసెన్సులూ, సదుపాయాలుగానీ, పౌరులకు హక్కుగా ఉన్న ఏ చిన్నపని అయినా జరగటం కాని పరిశీలిస్తే. సిఫార్సుగాని లంచంగాని లేకుండా సామాన్యుడికి న్యాయం జరగడం దుస్సాధ్యం. పాలనలో రహస్యం, ఎన్నికల కోసం నిధుల సమీకరణలో సర్వత్రా కనిపించే అక్రమాలు, వాటి ఫలితంగా ఆశ్రితులకి, అయినవాళ్లకి కల్పించే ప్రత్యేక సదుపాయాలు, పైరవీలతో తప్ప తెరుచుకోని ఫైళ్ళు, లంచాలు లేకపోతే మూతపడే తలుపులు, కోర్టుల్లో సంవత్సరాల తరబడి జాప్యాలు, నిర్దేశించిన పద్ధతి ప్రకారం ఏమీ జరగని పనులు, బెదిరింపులకు తప్ప ప్రతిస్పందించని పాలనాయంత్రాంగం - వీటన్నింటి పుణ్యామా అని అధికారం, కండబలం, డబ్బు, హోదా ఉన్న వాళ్ళ చేతుల్లో చట్టం కీలుబొమ్మగా మారిపోయింది. సామాన్య పౌరులు హుందాతనాన్ని కోల్పోయి, ప్రతి పనికి సర్దుకుపోవటం నేర్చుకొని, అవమాన భారాన్ని దిగమ్రింగుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 'చట్టపాలన' దృష్ట్యా మన ప్రజాస్వామ్యానికి నూటికి 5 మార్కులు కూడా కష్టమే.

## స్వయం పరివర్తన (Self -correction)

గతానుభవం నుండి నిరంతర పాఠాలు నేర్చుకొని, తదనుగుణంగా నిర్దిష్ట లక్ష్యంతో మార్పులు చేసుకుంటూ, పాలనా యంత్రాంగాన్ని ప్రజలకు సమర్థవంతంగా సేవలందించే పరికరంగా తయారు చేసే ప్రక్రియ రాజ్యవ్యవస్థలో స్వయంపరివర్తనా శక్తి. కొద్ది మంది చిత్తశుద్ధిగల నాయకులో, అధికారులో విశ్వప్రయత్నం చేసి అక్కడక్కడ కొన్ని మంచి మార్పులను తేవడానికి ప్రయత్నం చేస్తున్నారు. కాని పాలనా వ్యవస్థ మొత్తాన్ని చూస్తే, మన అవసరాలతో పోలిస్తే, మనం తెచ్చే కొద్ది మార్పులు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. ఎలాంటి రాజ్యవ్యవస్థ అయినా అన్ని విధాలా సంతృప్తికరంగా ఉండజాలదు. నిరంతరశోధన, దైనందిన స్పందన, నిర్విరామ పరివర్తన లేనట్లయితే పాలన స్థంభించిపోతుంది. చెడు పెరుగుతుంది. మంచి ఇంకి పోతుంది. మన పాలనా వ్యవస్థలన్నీ ఈ స్వయం పరివర్తనాశక్తిని కోల్పోవడంతో శుష్కించి పోతున్నాయి. పన్నులు వసూలు చేసి,

జీతభత్యాలిచ్చుకొని, తమని తాము పోషించుకోవడం తప్ప, ఎదురౌతున్న సమస్యల్ని సమర్థవంతంగా పరిష్కరించే నేర్పరితనాన్ని పాలనా వ్యవస్థ కోల్పోయింది. పట్టు తప్పి దీనావస్థలో ఉంది. దశాబ్దాల పర్యంతం ఎన్నో విషయాలపై చర్చలు జరిగినా, ఫలితం శూన్యం. ఎన్నికలు సంస్కరణలు, పార్టీల ప్రజాస్వామికీకరణ, నిజాయితీగా నిధుల సమీకరణ, కేంద్రరాష్ట్ర సంబంధాల సమతూకం రాజ్యాంగంలో 356 వ అధికరణం దుర్వినియోగం, న్యాయమూర్తుల, ఇతర రాజ్యాంగ సంస్థల నిష్పాక్షిక నియామాకం, లంచగొండితనం నిర్మూలన, పాలనా సంస్కరణలు, పోలీసు వ్యవస్థ ప్రక్షాళన, నిజమైన స్వయం పాలనాధికారం ఉన్న స్థానిక ప్రభుత్వాలు, న్యాయస్థానాల్లో కేసుల సత్వర పరిష్కారం ఇలా ఎన్నో అంశాలు-అన్ని వర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పక్షాలు పరిష్కారం కోసం ముక్త కంఠంతో పరితపించిన అంశాలు- కొంతమేరకు ఏకాభిప్రాయాన్ని సిద్ధించిన అంశాలు ఇవన్నీ నేటికీ అపరిష్కృతంగా ఏ మార్పు లేకుండా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా పడున్నాయి. స్థానికంగా చిన్న విషయాల్లో కూడా మార్పులు కావాలంటే బంద్‌లు, హర్తాళ్లు, సమ్మెలు, లాఠీదెబ్బలు, దహనకాండ, హింస, నిరసన వ్రతాలు తప్పటం లేదు. పాలనా వ్యవస్థ స్వయం పరివర్తనా శక్తిని చాలా వరకు కోల్పోయిందని భావించటానికి ఈ ఆధారాలు చాలు. మన కొలమానంలో స్వయం పరివర్తన మార్కులు నూటికి 10ని మించవు.

## II పుట్టుకతో వివక్షత

రాజకీయరంగంలోనే కాదు మన సామాజిక రంగంలోనూ ఇలాంటి అవ్యవస్థ నెలకొంది. పుట్టుకతో వివక్షతకు గురి అవుతున్న తరగతులు, వర్గాలు, రాజకీయ సామాజిక రంగాలలో తమ వాటా కోసం, తమ గుర్తింపు కోసం, తమ ఆత్మగౌరవం కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. నిజమైన రాజకీయం దీనిని పట్టించుకోవాలి. దళితులు, బలహీనవర్గాలు, మహిళలు చేస్తున్న ఇలాంటి ప్రయత్నాలను ఒక సామాజిక ఉద్యమంగా మలచడం రాజకీయం చేయవలసిన పని. కానీ, ప్రస్తుత రాజకీయం ఈ అంశాలను తమ ఓటు బ్యాంకు రాజకీయాలకు చాకచక్యంగా వినియోగించుకునే చాణక్యనీతిని ప్రదర్శిస్తున్నది. దీనివల్ల ఒక సామాజిక ఉద్యమంగా రూపాంతరం చెందాల్సిన దళితుల ఉద్యమాలు కుల, ఉపకుల ఉద్యమాలుగా మారి, అంతర్గత సంఘర్షణలో కొట్టుమిట్టాడుతున్నాయి. బలహీనవర్గాలు తమ గుర్తింపు కోసం చేతివృత్తి సంఘాలు నెలకొల్పుకున్నాయి. తమ ఆత్మగౌరవం కోసం ఆరాటపడుతున్నాయి. సమాజానికి పనికి వచ్చే ప్రతి వృత్తీ గౌరవప్రదమైన కార్యకలాపంగా అందరూ భావించాలి. ప్రజలు గుర్తించే విధంగా దీనిని ఒక సామాజిక ఉద్యమంగా రాజకీయం మల్చలేకపోయింది. బలహీన వర్గాలలో వివిధ కులాల మధ్య సమన్వయం సాధించాల్సిన రాజకీయం ఆ విభజనను తన రాజకీయ లబ్ధికి వినియోగించుకుంటున్నది. సమాజంలో సగభాగంగా వున్న మహిళలు పుట్టుకతో వివక్షతకు గురౌతున్నారు. స్త్రీ విముక్తి ఉద్యమాలు కొందరిని ప్రభావితం చేసినా, అవి విశాలమైన సామాజిక ఉద్యమ రూపం ధరించలేదు. దీనికి తోడు ప్రాంతీయ, ఉపప్రాంతీయ వ్యత్యాసాలు, మిగిలిన తరగతుల లోని పేదలు తమ సామాజిక స్థితిగతుల మీద తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఇలా పుట్టుకతో వివక్షత, లింగవివక్షత, అభివృద్ధిలో తారతమ్యాలు, పేదరికపు అంతరాలు మన సమాజంలో తీవ్ర అసంతృప్తికి కారణాలు అవుతున్నాయి. రాజకీయం ఈ సమస్యల్ని వినియోగించుకుంటున్నదే కాని ఈ సమస్యల్ని అర్థం చేసుకుని ఆచరణయోగ్యమైన పరిష్కారాల్ని అన్వేషించడం లో పూర్తిగా విఫలం అవుతున్నది. ఇదే పద్ధతి కొనసాగితే మన సమాజం నిరంతరం అంతర్గత సంఘర్షణలకి లోనౌతుంది. రాజకీయం ఈ సమస్యలపై దృష్టి సారించకపోతే మన సమాజమే అతలాకుతలం అవుతుంది.

భారతీయ సమాజంలో శతాబ్దాల పర్యంతం కుల వ్యవస్థ దురదృష్టవశాత్తున అంతర్భాగంగా వచ్చింది. ఈ సమాజాన్ని కులాల అంతరాలతో, కృత్రిమమైన అడ్డుగోడలతో నిట్టనిలువునా ఎన్నో రకాలు ముక్కలుగా చీల్చేశారు. కేవలం అనేక తెగలు, ముక్కలుగా చీల్చడం మాత్రమే కాకుండా, కొన్ని కులాలు ఎక్కువ, మరికొన్ని కులాలు తక్కువ అని సామాజికంగా, సాంఘికంగా అంతరాలను సృష్టించారు. కొన్ని శతాబ్దాలపాటు వారి ఎదుగుదలకు అనేక అవరోధాలు కల్పించారు. విద్య లేకుండా, సమాజంలో గౌరవం లేకుండా, కొన్ని వృత్తులను నీచవృత్తులుగా ప్రకటించి, తక్కువ వృత్తులుగా పరిగణించి, ఆ వృత్తుల వారందరూ తక్కువ కులాల వారని, కొన్ని వృత్తులను గొప్ప వృత్తులుగా పరిగణించి, ఆ వృత్తుల వారందరూ గొప్పవారని ఇలా అంతరాలు పెట్టి, అన్ని రకాలుగా మానసికంగా, శారీరకంగా, సామాజికంగా, ఆర్థికంగా కుళ్ళపొడిచారు. ఇది వాస్తవం. దాని పర్యవసానంగా ఈ నాటికీ కూడా నూటికి 70, 80 మంది పిల్లల భవిష్యత్తు కేవలం పుట్టుక వలన నిర్ణయం అవుతోంది. ఈ రోజు మనం ఒక బిడ్డ కుటుంబం, కులం, ఆర్థిక పరిస్థితి తెలుసుకుని, ఆ బిడ్డ భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించి జ్యోతిష్యం రాసినట్లయితే పాతికేళ్ళ తరవాత ఆ జ్యోతిష్యం నూటికి 80 సందర్భాలలో సరైందే అవుతుంది. అంటే ఏమిటి? కులం ఈనాటికి కూడా కొన్ని

కోట్లమంది బిడ్డల భవిష్యత్తును శాసిస్తున్నమాట వాస్తవం. నిజాయితీగా మనం దానిని ఒప్పుకోవడం సమస్య పరిష్కారంలో మొదటి మెట్టు అవుతుంది. అలాగే కులం, బీదరికం- ఈ రెండు వివక్షతలాగానే, కేవలం ఆడపిల్లగా పుట్టటం మన సమాజంలో ఇప్పటికీ వివక్షకి కారణమౌతున్నది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల ఆధారంగా ప్రజాస్వామ్యం రూపుదిద్దుకుంది. కుల వివక్ష, లింగవివక్ష కొనసాగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మాయని మచ్చ. ప్రజాస్వామ్యం పరిపూర్ణం కావాలంటే ఈ వివక్షతను అంతం చేయాలి. పుట్టుకతో వివక్షతను తొలగించడానికి ఈ తరగతులు ఆర్థిక, సామాజిక, రాజకీయ హోదాలను పెంపొందించటం రాజకీయానికి కీలక అంశం కావాలి.

విధిగా అందరికీ విద్య, ఆరోగ్యం మంచి ప్రమాణాలతో అందే ఏర్పాటు చేయాలి. లోక్‌సత్తా ఆదినుంచి చెబుతున్నది, రేపు రాజకీయంగా కూడా పెద్దపీట వేయబోయేది ఈ రెండు రంగాలకే. రాజకీయాన్ని ఈ రెండు రంగాల చుట్టూ తిప్పాలనుకుంటున్నది. అందరికీ మంచి ప్రమాణాలు గల విద్య, ఆరోగ్యం ఉచితంగా అందేటట్లు ఖచ్చితంగా ఏర్పాట్లు చేయాలి. ఊరికే కాగితం మీద చూపెట్టడం కాదు. నినాదాలు ఇవ్వడం కాదు. ఖచ్చితంగా ఇది జరగాలి. రేపు లోక్‌సత్తా జయాపజయాలను ఎలా అంచనా వేస్తారు, అంటే ఈ ఒక్క అంశమే. పుట్టుకతో నిమిత్తం లేకుండా అందరికీ మంచి ప్రమాణాలు గల విద్య, ఆరోగ్యం అందించే ఏర్పాట్లు, నూటికి నూరుశాతం వీలుకాకపోవచ్చు. ఈవేళ 20 ఉంటే 70 శాతానికో, 80 శాతానికో తీసుకెళ్ళగలిగామా లేదా,అన్నదే లోక్‌సత్తా జయాపజయాలకు ప్రమాణంగా స్వీకరించాలి.

**(రిజర్వేషన్లు మహిళల అభివృద్ధి సమస్యలపై వివరణ కోసం ప్రశ్నలు-జవాబులు పుస్తకాన్ని చూడండి.)**

# III రాజకీయం అంటే ఏమిటి?

రాజకీయం ఎందుకు అన్న ప్రశ్న మనం వేసుకోవాలి. సరైన అర్థాన్ని మనం తెలుసుకోవాలి. ప్రజలు తమంతట తాము చేసుకోలేని పనులను చక్కబెట్టేది రాజకీయం. సమాజంలో వివిధ తరగతుల వారుంటారు, వారిమధ్య అంతరాలు, వ్యత్యాసాలు వుంటాయి. ఈ అంతరాలను అధిగమించి, సామరస్యాన్ని అభివృద్ధిలో సమతూకాన్ని సాధించేది రాజకీయం. సమాజంలో వనరులు ఎప్పుడూ పరిమితంగా వుంటాయి. ప్రజల అవసరాలు అపరిమితంగా వుంటాయి. ఈ రెండింటికీ మధ్య వారధి కట్టేది రాజకీయం. ప్రజలు తమంతట తాము సమకూర్చుకోలేని విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కల్పనకు తగిన పరిష్కారాలను కనుగొనేది రాజకీయం. ప్రజల ఆకాంక్షలకు ఒక రూపం ఇచ్చి, దానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించి ప్రజల్ని లక్ష్యసాధన వైపు నడిపించేది రాజకీయం. సమాజహితం కోసం ప్రభుత్వాల ఏర్పాటుకు, నిర్వహణకు ప్రజల్ని సమీకరించేది రాజకీయం.

రాజకీయం కేవలం అధికార క్రీడ మాత్రమే కాదు. దానికి అధికారం ఒక సాధనం మాత్రమే. రాజకీయం పరిధి అంతకంటే విస్తృతమైంది, విశాలమైంది. ప్రజల దైనందిన జీవితంలో రాజకీయం స్పృశించని రంగం అంటూ ఏదీ వుండదు. సమాజహితం కోసం చేసే ప్రతి కార్యకలాపం రాజకీయమే. గ్రామం కోసం, రాష్ట్రం కోసం, దేశం కోసం చేసే ప్రతి పనీ రాజకీయమే. అందుకే రాజకీయం ఒక పవిత్ర సామాజిక వ్యాసంగం.

రాజకీయం ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకి, పార్టీలకి, వారి కార్యకర్తలకి మాత్రమేకాదు, ప్రజలందరికీ అవసరం. ప్రజలు ఓటు ద్వారా తమ అధికారాన్ని, పన్నుల ద్వారా తమ సొమ్మునీ ఎవరి చేతుల్లో పెట్టాలో తెలుసుకోవడం రాజకీయం. తమ పిల్లల చదువు, కుటుంబ ఆరోగ్యం, తమ గ్రామాభివృద్ధి ఎవరు ఎలా మెరుగు పరుస్తారో తెలుసుకోవడం రాజకీయం. అందువల్ల రాజకీయం మనందరి అవసరం. ప్రజాస్వామ్యం మనుగడకి, సుపరిపాలనకు మంచి రాజకీయం తప్పనిసరి.

ప్రస్తుతం మన కళ్ళముందు నడుస్తున్నది నకిలీ రాజకీయం. అందుకే "రాజకీయం అంటే తప్పుడు పని" అన్న అర్థం ప్రజల్లో స్థిరపడింది. "ఇంటర్వ్యూ బాగా చేశానంటున్నావ్ నీకు ఉద్యోగం ఎందుకు రాలేదు." అన్న ప్రశ్నకి "అన్ని అర్హతలూ వున్నా నీకు ప్రభుత్వం ఇల్లు ఎందుకు కేటాయించలేదు." అన్న ప్రశ్నకి, "మీ యువశక్తి బృందానికి లోను ఎందుకు మంజూరు కాలేదు." అన్న ప్రశ్నకి "మీ మహిళా బృందానికి రివాల్వింగ్ ఫండ్ ఎందుకు రాలేదు." అన్న ప్రశ్నకి వచ్చే సమాధానం ఒక్కటే "రాజకీయం జరిగిపోయింది సార్, మీకు తెలియందేముంది" అంటారు. రాజకీయం అంటే అవినీతి, దగా,మోసం అన్న అర్థం స్థిరపడిందనడానికి ఇంతకంటే ఉదాహరణ అక్కరలేదు.

ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టడం, తిరిగికోట్లు దండుకోవడం ప్రస్తుతం రాజకీయం అయింది. ఎన్నికల్లో గెలవడానికి తప్పుడు పనులు చెయ్యడం రాజకీయం అయింది. అక్రమ సంపాదనకు రాజకీయం రాచమార్గం అయింది. పదవిని, అధికారాన్ని తనకోసం, తన అనుచరుల కోసం వినియోగించడం రాజకీయం అయింది

అందుకే మర్యాదస్తులు రాజకీయాలకి దూరం అయ్యారు. రాజకీయాలలో మంచి చేద్దామనుకునే వారికి అవకాశాలు సన్నగిల్లి పోతున్నాయి. ఈ రాజకీయపతనం ప్రజాస్వామ్యానికి హాని చేస్తుంది. మన గ్రామాలకి, దేశానికి చెరుపు చేస్తుంది. స్వచ్ఛమైన పాలన అందించాల్సిన రాజకీయం అవినీతికి, అక్రమాలకు నెలవుకావడం అంటే, కంచే చేను మెయ్యడం అన్నమాట.

ఇది తప్పుడు రాజకీయం, ఇది క్షీణ రాజకీయ సంస్కృతి. దీనిని మనం వదిలించుకోవాలి. నిజమైన రాజకీయం కోసం, నూతన రాజకీయ సంస్కృతి కోసం మనం నడుం బిగించాలి. మంచి రాజకీయం వల్ల ప్రయోజనం పొందే యువత, మహిళలు, దళితులు, బలహీనవర్గాలు, ఇలాంటి మార్పు రావాలని ఆకాంక్షించే ఇతరులందరూ కలిసి నడవాలి. ఈ దుష్ట రాజకీయాన్ని మార్చాలి. సమాజహితం కోరే రాజకీయాన్ని, పిల్లల చదువునీ, మన కుటుంబాల ఆరోగ్యాన్ని, యువతకు ఉపాధినీ, గ్రామాల అభివృద్ధినీ పట్టించుకునే రాజకీయాన్ని సాధించాలి. మనకు, మన గ్రామానికి మంచి చేసే రాజకీయాన్ని పెంపొందించాలి. అందుకు సారథులుగా నిలిచేవారు ముందుకు రావాలి. ప్రజలు అలాంటివారిని ఆదరించాలి.

# IV నూతన రాజకీయ సంస్కృతి-ఆవశ్యకత

## 1. నూతన రాజకీయ సంస్కృతి

### ఎ) ప్రస్తుత రాజకీయం - హీన సంస్కృతి

- ప్రస్తుత రాజకీయం ధనరాజకీయం. వ్యాపారం రాజకీయం ఎన్నికల్లో ఓట్లు కొనడం, మద్యం పోయడం, కోట్లు ఖర్చుపెట్టడం, తిరిగి కోట్లు దండుకునే అవినీతి రాజకీయం సాగుతున్నది.
- అధికారదాహానికి, అవినీతికి వీలుగా కేంద్రీకృతపాలన సాగుతున్నది. పరిపాలన ప్రజలకు దూరమైంది.
- పాలకులు ప్రభువులవుతున్నారు-ప్రజలు యాచకులవుతున్నారు. అవినీతికి వీలుగా పారదర్శకత, జవాబుదారీతనం లేని పాలన సాగుతున్నది.
- రాజకీయం పదవి చుట్టూ తిరుగుతున్నది. ప్రజల సమస్యల్ని విస్మరిస్తున్నది.

### బి) లోక్‌సత్తా పార్టీ-నూతన రాజకీయ సంస్కృతి

- ధన రాజకీయాన్ని జన రాజకీయం చెయ్యడంఅంటే రాజకీయం వ్యాపారం కాకుండా సమాజసేవ చేసే పవిత్ర వ్యాసంగం కావాలి.

  ఓట్లు కొనడం, మద్యం పొయ్యడం, తిరిగి సంపాదించుకోవడం వంటి అవినీతి రాజకీయాన్ని వదిలించడం.
- కేంద్రీకృతపాలనకు స్వస్తి చెప్పటం, పౌరులు కేంద్రంగా పరిపాలనను వికేంద్రీకరించటం.

  ప్రజల సొమ్ము ప్రజల కళ్లముందు, వారి అవసరాల కోసం ఖర్చు కావాలి. ఇంటిముందు ప్రభుత్వం, కంటిముందు పాలన సాధించటం.

  ప్రతి జిల్లాకి జిల్లా ప్రభుత్వం వుండాలి. ప్రతి గ్రామానికి/మండలానికి/పట్టణానికి స్థానిక ప్రభుత్వాలు ఏర్పడాలి.
- అన్ని ప్రభుత్వ శాఖలలో సమాచార హక్కును, సిటిజన్స్ ఛార్టర్లను అమలు చేయటం, పాలనలో పూర్తిగా జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలి.
- పదవి చుట్టూ తిరిగే రాజకీయాన్ని ప్రజల చుట్టూ తిప్పటం. విద్య, ఆరోగ్యం అందరికి అందించడం. పుట్టుకతో,పేదరికంతో ఏర్పడుతున్న వివక్షతల్ని తొలగించడం.

**1. మార్పు సాధ్యమేనా?**

ప్రస్తుత రాజకీయం కుళ్లిపోయిందనీ, అవినీతికీ నేరచరితకీ తావు అయిందని, అదొక అధికార క్రీడగా, వ్యాపారంగా మారిందని అందరూ అంగీకరిస్తారు. చివరికి రాజకీయాలలో క్రియాశీలంగా వున్న కొందరు కూడా దీనిని కాదనడం లేదు. దీనిని మార్చవలసిన అవసరం వుందని అందరూ బల్లగుద్ది మరీ వాదిస్తారు. పోతే దీనిని మార్చగలమా అన్నది చాలా మందిని వేధిస్తున్న సమస్య. ఎందుకంటే రాజకీయం నానాటికీ దిగజారుతున్నదనీ, ప్రజలు నానాటికీ ప్రలోభాలకు లోనౌతున్నారేగాని మార్పుకు సిద్ధమౌతున్న ఛాయలు కనిపించడం లేదనీ చాలామంది భావిస్తున్నారు. అందుచేత ఎవరికి వారు ఈ రాజకీయాలకి దూరంగా వుండడమే మంచిదని తలపోస్తున్నారు. ఇవన్నీ కళ్లముందు కనిపిస్తున్న అంశాలైనందువల్ల నిరాశకీ, నిస్పృహకీ గురౌతున్నారు. మార్పుకోరే ప్రయత్నాల పట్ల పెదవి విరుస్తున్నారు. అందుచేత మనం ఈ అంశాలను కొంత లోతుగా విశ్లేషణ చేసుకోవాలి.

మానవ చరిత్ర ఎప్పుడూ ముందుకే నడుస్తుంది. ఈ నడకలో కొన్ని తాత్కాలికమైన ఆటుపోట్లు, అవరోధాలు, వెనుకడుగులు వుంటాయి. వాటిని చూసి ఎవరూ బెంబేలు పడకూడదు. నిరాశానిస్పృహలకు లోనుకాకూడదు. మనదేశంలో ఇంత చెడిపోయిందనుకున్న రాజకీయం కూడా దేశాన్ని ఇంతవరకూ ముందుకే నడిపించింది. అయితే నడవాల్సినంత వేగంగా నడవలేదు. సాధించాల్సిన అభివృద్ధి సాధించలేదు. అలాగే ప్రజలు మార్పుకోసం అనేక ప్రయత్నాలు చేశారు. చాలా విజయాలు సాధించారు. ఇవన్నీ మనం కాదనలేని సత్యాలు. మనదేశం మన రాష్ట్రం స్వాతంత్ర్యానికి పూర్వంకంటే ఇప్పుడు నిస్సందేహంగా అభివృద్ధి చెందాయి. మన చదువు, మన ఆరోగ్యం, మన ప్రజల సంపాదనాశక్తి నిస్సందేహంగా పెరిగాయి. కాని ఈనాటి అధునిక ప్రపంచ విజయాల స్థాయికి సరితూగేవిగా లేవు. ఈనాటి సాంకేతి కాభివృద్ధికి అనుగుణంగా లేవు. ఈ అగాధాన్ని పూడ్చాల్సిన రాజకీయం అలాంటి పని ఎందుకు చెయ్యలేక పోతున్నది? ఇలాంటి మార్పుని ప్రజలు ఆహ్వానించడం లేదా? లేక వారికి అలాంటి మార్పు సాధించే అవకాశాలు అందుబాటులో లేకుండా పోయాయా? ఇవీ మనం ఆలోచించాల్సిన అంశాలు. ఇందుకు మనదేశంలో జరిగిన రాజకీయ పరిణామాలను మనం అర్థం చేసుకోవాలి. వాటి ఆధారంగా ఈ సమస్యలకు పరిష్కారాన్ని అన్వేషించాలి.

## 2. రాజకీయ వ్యవస్థలో పరిణామాలు

**మొదటి దశ :**

1947 నుండి 1967 వరకు దేశంలో రాష్ట్రాలలో దాదాపుగా ఏకపార్టీ అధిపత్యం కొనసాగిన దశ ఈ తొలిదశ ప్రథమార్థంలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తికి కొనసాగింపుగా పలు ప్రజాస్వామ్య సంస్థలు రూపుదిద్దుకున్నాయి. ఉత్తమ విలువలు గల రాజ్యాంగం, స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయవ్యవస్థ, ఎన్నికల నిర్వహణా వ్యవస్థ, పార్లమెంటరీ సంస్థలు, పత్రికాస్వేచ్ఛ వగైరాలన్నీ ఆనాటి రాజకీయం సాధించిన విజయాలు. ఎన్ని లోపాలున్నా వ్యవసాయాభివృద్ధికీ, పారిశ్రామికాభివృద్ధికీ ఈ దశలో గట్టి పునాదులు ఏర్పడ్డాయి.

కాని ప్రజాస్వామ్యంలో ఏకపార్టీ గుత్తాధిపత్యం తెచ్చే అనర్థాలు పెరుగుతూ వచ్చాయి. అవినీతి, అధికార దుర్వినియోగం, జాతీయస్థాయిలోనే కేంద్రీకృతమైపోయిన పాలన రాను రాను ప్రజల అసంతృప్తికి కారణాలయ్యాయి. 1967 లో 9 రాష్ట్రాలలో ప్రజలు ఈ ఏకపార్టీ గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా తీర్పు చెప్పారు. ప్రజాస్వామ్యంలో బహుళపార్టీల పోటీకి, అధికారానికి మార్గం వేశారు.

**రెండవ దశ :**

ఇది మనదేశ రాజకీయాలలో చాలా సంక్లిష్టమైన దశ

ఈ దశలో రాజకీయానికి దేశం ఒక ప్రయోగశాల అయింది. 1967 లో వివిధ రాష్ట్రాలలో ఏకపార్టీ గుత్తాధిపత్యం బద్దలుకావడంతో అధికారం కోసం రాజకీయ సంఘర్షణ తీవ్రతరం అయింది. జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయాన్ని నిరోధించడానికి 1975లో ఎమర్జెన్సీ విధించబడింది. ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడినా ఆ ఎమర్జెన్సీయే దేశంలో ప్రత్యామ్నాయాన్ని రూపొందించడానికి సాధనం అయింది. 1977లో జాతీయస్థాయిలో ఏకపార్టీ ఆధిపత్యం తొలగిపోయింది. ప్రజాస్వామ్యం పునరుద్ధరణతో పాటు అది మరింత బలపడింది, స్థిరపడింది.

జాతీయ స్థాయిలో, చాలా రాష్ట్రాలలో ఒకేసారి ఏకపార్టీ ఆధిపత్యం బద్దలు కావడంతో అటు జాతీయస్థాయిలలో, ఇటు రాష్ట్రాలలో కొత్త పార్టీలు పుట్టుకొచ్చాయి. వివిధస్థాయిలలో అధికారాన్ని పొందడానికి అందివచ్చిన ప్రతి అవకాశాన్ని రాజకీయం వినియోగించుకుంది. ఈ పరిస్థితులలో మతం, కులం, ప్రాంతం అన్నీ రాజకీయంలో పాత్రధారులయ్యాయి. కొన్ని రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఏర్పడి స్థిరపడ్డాయి. కొన్ని రాష్ట్రాలలో కులం ప్రాతిపదికన పార్టీలు రూపుదిద్దుకున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిలలో కొన్ని పార్టీలు బలపడడానికి మతం దోహదపడింది. ఇవన్నీ భావోద్రేక సమస్యలుగా కనిపించినా మనం పట్టించుకోని సామాజిక సమస్యలు, మనం తెచ్చిపెట్టుకున్న కేంద్రీకృత పాలన నుండి ఉత్పన్నమైన సమస్యలు. ఈ కాలంలో మన ప్రజాస్వామ్యం ఈ ఆటుపోట్లకు తట్టుకునే పరిణతి దిశగా పయనించింది. అలాగే ఆర్థికరంగంలో కూడా పెనుమార్పులు సంభవించాయి. దేశం నూతన సంస్కరణల యుగంలోకి ప్రవేశించింది.

దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి విస్తరించడం, ఫెడరల్ స్ఫూర్తి బలపడడం, రాష్ట్రాల పాత్ర గణనీయంగా పెరగడం, సామాజిక సమస్యలు రాజకీయంలో పాత్రధారులుకావడం, ఆర్థికరంగంలో సంస్కరణల ప్రారంభం - ఇవన్నీ రాజకీయం సాధించిన విజయాలే. కాని ఇన్ని విజయాలు సాధించిన రాజకీయ రంగమే ఇప్పుడు సమస్య అయింది. ఒకసంధి కాలంలోకి దేశాన్ని నెట్టింది. దీనిని ఎలా పరిష్కరించాలన్నదే మనముందున్న ప్రస్తుత సమస్య.

**సంధిదశలో రాజకీయ వ్యవస్థ**

- ఏకపార్టీ ఆధిపత్యదశ అంతరించడంతో దేశంలో పలుపార్టీలు పుట్టుకొచ్చాయి.
- ఇందులో భాగంగా ప్రాంతీయ పార్టీలు, కుల, మతాల ప్రాతిపదికన గల పార్టీలు ఏర్పడ్డాయి. ప్రజలలో అలాంటి భావోద్రేకాలు చల్లబడగానే ఈ తరహా పార్టీలు కూడా తమ పాత నినాదాలను అడపాదడపా వినియోగించుకుంటూనే, సంప్రదాయ పార్టీల పద్ధతులనే అనుసరించడం మొదలు పెట్టాయి.
- బహుళపార్టీల ఏర్పాటుతో రాజకీయ రంగంలో పోటీ తీవ్రతరం అయింది. అధికారం పొందడానికి, అందులో భాగంపంచుకోడానికి చిన్న, పెద్ద పార్టీలు జాతీయస్థాయిలో రాష్ట్రాలస్థాయిలో వివిధకూటములుగా ఏర్పడుతున్నాయి.ఈ క్రమంలో దేశంలోని అన్ని పార్టీలూ ఎప్పుడో ఎక్కడో ఒకచోట అధికారంలో పాలుపంచుకుంటున్నాయి. ఇప్పుడు దేశంలో దాదాపు అన్ని పార్టీలు అధికారం పొందిన పార్టీలే కావడం విశేషం.

**3. పెడ మార్గం పట్టిన రాజకీయం**

రాజకీయ రంగంలో బహుళ పార్టీల ప్రవేశంతో రాజకీయపరమైన పోటీ పెరిగింది. అధికారాన్ని అందిపుచ్చుకునే అవకాశాలు అన్ని పార్టీలకు వస్తున్నాయి. ఇవన్నీ రాజకీయరంగంలో మంచి పరిణామాలకు, ఆరోగ్యపరమైన పోటీకి, ప్రజల సమస్యల పరిష్కారానికి కొత్త ప్రత్యామ్నాయాల రూపకల్పనకు దారితియ్యాలి. కానీ, మనదేశంలో రాజకీయం ఇలాంటి ఉత్తమ పద్ధతులకు దిగకుండా దానిని భ్రష్టు పట్టించింది. ఇదే ఈ కాలంలో జరిగిన గొప్ప రాజకీయ విషాదం.

- బహుళ పార్టీల వల్ల ప్రజలు ముందుకు బహుళ ప్రత్యామ్నాయాలు రావాలి, ప్రజలకు ఎంచుకునే అవకాశాలు పెరగాలి. మనదేశంలో ఇలాంటి మంచి పద్ధతులు రావడానికి బదులు రాజకీయం కేవలం అధికార క్రీడకే పరిమితం అయింది. అధికారాన్ని అందుకోవడమే ఏకైకలక్ష్యం కావడంతో రాజకీయం అన్ని వక్రమార్గాలను ప్రయోగించే హీన సంస్కృతిలోకి దిగజారింది.
- బహుళ పార్టీల వల్ల రాజకీయ రంగంలో వచ్చిన పోటీ మంచిమార్గంలో సాగివుంటే రాజకీయ పార్టీలు తమ పునాదినీ ప్రభావాలనీ పెంచుకోడానికి ప్రజల చుట్టూ, ప్రజ సమస్యల చుట్టూ తిరిగి ఉండేవి. ప్రజల్ని ప్రభువుల్ని చెయ్యడంలో పోటీపడాల్సిన రాజకీయం కేవలం అధికార క్రీడగా దిగజారడంతో ప్రజలు కేవలం ఓటర్లుగా భావించబడుతున్నారు. అందువల్ల ఓట్లు పొందే జనాకర్షణ పథకాలకు, రాజకీయం ప్రధానంగా పరిమితం అయింది. అధికారం పొందడమే ఏకైక లక్ష్యంగా, పోలింగ్ నాడు ఓట్లు కొనుగోలుకీ, సారాయి పంపిణీకి, దొంగఓట్లకీ, రిగ్గింగులకీ ప్రాధాన్యత పెరిగింది. ఇటీవల తమిళనాడు ఎన్నికలు ఈ క్రమానికి పరాకాష్టగా వుంది. అధికారం పొందడానిక పై వక్రమార్గాలతో పాటు ప్రభుత్వ సొమ్ముతో ఓటర్లను నేరుగా కొనుగోలు చేసే పద్ధతులు ప్రారంభం అయ్యాయి.
- దేశంలో అన్ని పార్టీలు ఏదో ఒక కూటమిలో చేరి అధికారంలో పాలుపంచుకుంటున్నాయి. దీంతో అధికార క్రీడ ఒక జాడ్యంగా ప్రధాన పార్టీలనే కాకుండా అన్ని పార్టీలనూ ఆవహించింది. అధికారంలో వాటాకోసం గెలుపు, గెలుపుకోసంవక్రమార్గాలు మొత్తం రాజకీయ వ్యవస్థని కలుషితం చేశాయి. ఇలా అన్ని పార్టీలు ఈ విషవలయంలో భాగం అయ్యాయి. క్షీణ సంస్కృతిలో మునిగితేలుతున్నాయి. ప్రస్తుతం రాజకీయపార్టీల మధ్య తేడా కేవలం నాయకులు, జెండాలలో తప్ప దాదాపు అన్నీ ఒకే సంస్కృతి తో వ్యవహరిస్తున్నాయి.

  ఈ విషవలయం నుండి బైటపడే ప్రయత్నాలు చెయ్యకపోగా రానురాను అవి ఈ ఊబిలో మరింతగా కూరుకుపోతున్నాయి. వాటికి స్వయందిద్దుబాటుకు ఎలాంటి ఏర్పాటు లేదు. కొత్త దారీ చూపించగల శక్తీ లేదు. ఈ సంధిదశని అధిగమించడం వాటికి సాధ్యం కావడం లేదు.

**4. ప్రజలకు ప్రత్యామ్నాయం లేదు**

రాజకీయ వ్యవస్థలో నెలకొన్న ఈ సంధిదశ, ప్రజలకు మరో ప్రత్యామ్నాయం లేకుండా చేసింది. గతంలో ఏకపార్టీ ఆధిపత్యాన్ని వదిలించుకోవాలనుకున్నప్పుడు, ప్రజల ముందు ఏకపార్టీ ఆధిపత్యాన్ని సవాలు చేసే పార్టీ లేదా పార్టీలు వున్నాయి. ప్రజలు మార్పుకు సాధనాలుగా అలాంటి పార్టీలను వినియోగించుకోగలిగారు.

అలాగే ప్రజలలో ప్రాంతీయ ఆకాంక్షలు బలంగా వ్యక్తమైనపుడు ఆ ఆకాంక్షలను ప్రతిబింబించే పార్టీలు ఉంటే వాటి ని గెలిపించారు. లేదా కొత్తగా అలాంటి పార్టీలు పుట్టుకొచ్చినా వాటినీ ఆదరించారు. మార్పుకి సాధనంగా ప్రజలు అలాంటి పార్టీలను వినియోగించుకున్నారు. కానీ ప్రస్తుత సంధిదశలో ప్రజల ముందు దేశంలోనూ, రాష్ట్రంలోనూ రెండేసి పార్టీలు లేదా

కూటములు ప్రధానంగా వున్నాయి. అవి కేవలం అధికార క్రీడగా మాత్రమే రాజకీయాన్ని నెరపుతున్నాయి. ఈ పక్షాలు ఎన్ని జనాకర్షణ పథకాలు ప్రవేశ పెట్టినా , డబ్బు ఎంత విరజిమ్మినా, ఎన్ని ప్రలోభాలు పెడుతున్నా, ప్రజలు మార్పుకోసం ఆరాటపడుతూనే వున్నారు. అధికారంలో వున్న పార్టీలను గద్దె దించుతున్నారు. కొత్త వాళ్లని ఎక్కిస్తున్నారు. వారిని మళ్లీ దించుతున్నారు. ఎందుకంటే ప్రజలు ఆట మార్చాలని ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు. కాని జరుగుతున్నది, "ఆటగాళ్లు మారుతున్నారు గాని ఆట తీరు మారడం లేదు". ఇలా ఎన్నిసార్లు ఆటగాళ్ళని మార్చినా ప్రజలు పెనంమీద నుండి పొయ్యిలోకి, పొయ్యిలో నుండి పెనం మీదకీ మారడం తప్ప వారి జీవితాలలో ఆశించిన మార్పు రావడం లేదు. ప్రజలకు ఆటగాళ్ళను మార్చడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. ఎందుకంటే ప్రజల ముందు ఆటను మార్చే పార్టీలు లేవు. ప్రజలు తమంతట తాము ప్రత్యామ్నాయ పార్టీలను సృష్టించుకోలేరు. అలాంటి ప్రత్యామ్నాయం వుంటే మార్పుకి సాధనంగా దానిని వినియోగించుకుంటారు. అది రానంతకాలం ఆటగాళ్లను మార్చడం తప్ప ప్రజలకు మరో మార్గం ఉండదు.

పార్టీలు రాజకీయ అధికార క్రీడలో మునిగిపోవడం, ప్రజలు తమంతట తాము ప్రత్యామ్నాయాన్ని రూపొందించుకోలేని స్థితి - ఇవీ ఈ సంధియుగం మనముందుంచిన సవాళ్లు.

ఈ సవాళ్లను అధిగమించేందుకు మరొక పార్టీని రూపొందించి, దానిని కూడా అధికార క్రీడలో భాగస్వామిని చేయడం పరిష్కారం కాదు. కొత్త తరానికి కొత్త రాజకీయాన్ని సృష్టించాలి. ఒక కొత్తరకం ప్రత్యామ్నాయాన్ని రూపొందించాలి. రాజకీయాలకి వున్న నిజమైన అర్థం ప్రాతిపదికగా ఒక నూతన రాజకీయ సంస్కృతిని సంతరించుకున్న ప్రతామ్నాయం తప్ప మరేదీ ఈ సంధియుగం సమస్యకు పరిష్కారం కాదు. ప్రజల ముందుకు అలాంటి ప్రత్యామ్నాయం వస్తే , దానిని మార్పుకు సాధనంగా వినియోగించుకునే అనుభవం ప్రజలకు వుందని గత చరిత్ర రుజువు చేస్తున్నది.

ఇలాంటి ప్రత్యేక తరహా పార్టీని, కొత్త రాజకీయ సంస్కృతికి పునాదిగా వుండే పార్టీని, ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా వుండే ప్రత్యామ్నాయాన్ని రూపొందించడం ఒక చారిత్రక అవసరం. అదొక్కటి మాత్రమే ఈ సంధి యుగం నుండి రాజకీయ వ్యవస్థను బయట పడేస్తుంది. సమాజహితం కోసం కార్యకలాపాలు నిర్వహించే సాధనంగా తిరిగి రాజకీయాన్ని మార్చగలుగుతుంది.

ఆ ప్రత్యామ్నాయం ఎలాంటి రాజకీయం మీద ఆధారపడాలి, ఎలాంటి సంస్కృతికి ప్రాతినిధ్యం వహించాలి?

### కొత్త రాజకీయ సంస్కృతిని సాధించడం ఎలా?

## 1. మంచి రాజకీయం ఆధారంగా నూతన ప్రత్యామ్నాయం

ప్రస్తుత రాజకీయాన్ని నిరసించడం అంటే మొత్తం రాజకీయాలనే ద్వేషించడం కాకూడదు. రాజకీయాలకు దూరంగా వుండటం కాకూడదు. నకిలీ రాజకీయాలను వదిలించుకోవడం ఎంత అవసరమో మంచి రాజకీయాన్ని, నూతన రాజకీయ సంస్కృతిని ఆహ్వానించడం అంతకంటే ముఖ్యం. ఎందుకంటే సమాజానికి, ప్రజాస్వామ్యానికి రాజకీయాలు అవసరం.

రాజకీయం కేవలం అధికార క్రీడ మాత్రమే కాదు. దానికి అధికారం ఒక సాధనం మాత్రమే. రాజకీయం పరిధి అంతకంటే విస్తృతమైంది, విశాలమైంది. ప్రజల దైనందిన జీవితంలో రాజకీయం స్పృశించని రంగం అంటూ ఏదీ వుండదు. సమాజహితం కోసం చేసే ప్రతి కార్యకలాపం రాజకీయమే. గ్రామం కోసం, రాష్ట్రం కోసం, దేశం కోసం చేసే ప్రతి పనీ రాజకీయమే. ఓ గాంధీ, ఓ అంబేద్కర్ చేసింది నిజమయిన రాజకీయం. అందుకే రాజకీయం ఒక పవిత్ర సామాజిక వ్యాసంగం.

ప్రజలు తమంతట తాము చేసుకోలేని పనులను చక్కబెట్టేది రాజకీయం. సమాజంలో వివిధ తరగతుల వారుంటారు,వారిమధ్య అంతరాలు, వ్యత్యాసాలు వుంటాయి. ఈ అంతరాలను అధిగమించి, సామరస్యాన్ని, అభివృద్ధిలో సమతూకాన్ని సాధించేది రాజకీయం. సమాజంలో వనరులు ఎప్పుడూ పరిమితంగా వుంటాయి. ప్రజల అవసరాలు అపరిమితంగా వుంటాయి. ఈ రెండింటికీ మధ్య వారధి కట్టేది రాజకీయం. ప్రజలు తమంతట తాము సమకూర్చుకోలేని విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల కల్పనకు తగిన పరిష్కారాలను కనుగొనేది రాజకీయం. ప్రజల ఆకాంక్షలకు ఒక రూపం ఇచ్చి, దానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించి ప్రజల్ని లక్ష్యసాధన వైపు నడిపించేది రాజకీయం. సమాజహితం కోసం ప్రభుత్వాల ఏర్పాటుకు, నిర్వహణ కు ప్రజల్ని సమీకరించేది రాజకీయం. ఇలాంటి మంచి రాజకీయం ఆధారంగా ఒక నూతన ప్రత్యామ్నాయాన్ని రూపొందించుకోవాలి.

## 2. కొత్త రాజకీయ సంస్కృతిని సాధించగల కొత్త తరహా రాజకీయపార్టీ

ప్రజలు రాజకీయ పక్షాల ద్వారా మాత్రమే ప్రత్యామ్నాయాన్ని చూడగలుగుతారు. అందుచేత మంచి రాజకీయాన్ని ఆచరణలోకి తీసుకురాగలిగిన ఒక కొత్త తరహా రాజకీయ పార్టీని రూపొందించాలి. ఇది ఏదో ఒక రాజకీయ పార్టీని ఏర్పాటు చెయ్యడం మాత్రం కాకూడదు. దానివల్ల ఎలాంటి ప్రయోజనం వుండదు. అది ప్రస్తుత రాజకీయాన్ని మార్చడం లక్ష్యంగా గల రాజకీయ పార్టీ అయివుండాలి. ఇదొక్కటి మాత్రమే ప్రస్తుత రాజకీయ సంధిదశకి నిజమైన పరిష్కారం అవుతుంది. అలాంటి పార్టీకి ఈ క్రింది మౌలిక లక్షణాలు వుండి తీరాలి. ఒక కొత్త రాజకీయ సంస్కృతికి ఒరవడిదిద్దేదిగా, దేశానికి మార్గాన్ని చూపేదిగా ఉండాలి.

### ఏ) ప్రజలే ప్రభువులు, పాలకులు సేవకులే

ప్రస్తుత రాజకీయాన్ని ఒక మలుపు తిప్పడం కొత్త రాజకీయ పార్టీ లక్ష్యం కావాలి. ఈ రాజకీయం తన అధికార క్రీడలో ప్రజల్ని కేవలం ఓటర్లుగా మిగిల్చింది. ఎన్నిక కాగానే పాలకులు ప్రభువులవుతున్నారు. ప్రజలు యాచకులవుతున్నారు. దీనిని తల్లకిందులు చెయ్యడం కొత్త పార్టీ నినాదం కావాలి. ఎన్నికైన వాళ్లు కేవలం ప్రజలు సేవకులుగా వ్యవహరించే నూతన రాజకీయ సంస్కృతి ఈ పార్టీకి ఆలంబన కావాలి.

### బి) ధన రాజకీయాలకు స్వస్తి-ప్రజా రాజకీయాలకు నాంది

ప్రస్తుతం ధన రాజకీయం నడుస్తున్నది. ఈ రాజకీయం లాభసాటి వ్యాపారం కావడంతో అది సంపన్నులకీ, అవినీతిపరులకీ, అక్రమార్జన పరులకీ, నేరచరితులకీ నిలయం అయింది. రాజకీయం వీరికి కుటుంబ సొత్తుగా, అలంకారప్రాయమైన హోదాగా సాగిపోతున్నది. సామాన్యులకు రాజకీయం అందని ద్రాక్ష అయ్యింది. ఈ స్థితిని సమూలంగా మార్చడం కొత్త రాజకీయ సంస్కృతి లక్ష్యం కావాలి.

ఇందుకోసం ఏర్పడే కొత్త పార్టీకి పౌరులు కేంద్రం కావాలి. ఈ పార్టీలో సామాన్య ప్రజలు క్రియాశీల పాత్రధారులు కావాలి. పుట్టుకతో వివక్షతకు గురౌతున్న దళితులు, బలహీనవర్గాలు, మహిళలు, అభివృద్ధికి దూరంగా వున్న ఆదివాసీలు, మైనారిటీలు ఇతర తరగతులలోని పేదలు - ఎవరికి ప్రభుత్వసేవలు అవసరమో అలాంటి వారందరికీ ఈ కొత్త రాజకీయ పార్టీ వేదిక కావాలి. ఈ సామాన్య ప్రజలు రాజకీయంలో నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి. అందుకు ఈ పార్టీ వారిచేతుల్లో సాధనం కావాలి. ప్రస్తుత ధన రాజకీయానికి ఈ ప్రజా రాజకీయమే విరుగుడు కావాలి.

### సి) పదవుల చుట్టూ తిరుగుతున్న రాజకీయాన్ని ప్రజల సమస్యల చుట్టూ తిప్పాలి

పదవి చుట్టూ తిరుగుతున్న ప్రస్తుత రాజకీయం, ఓట్లు కొల్లగొట్టే కళనే రాజకీయ కార్యకలాపంగా సాగిస్తున్నది. ప్రజాకర్షణ నినాదాలివ్వడం, ఎదుటివారి తప్పుల్ని ప్రచారం చెయ్యడం, స్థానికంగా వున్న అంతరాలని, విభేదాలని వినియోగించుకోవడం, మీదే ఆధారపడుతున్నది. కొత్త రాజకీయ పార్టీ దీనికి భిన్నంగా వ్యవహరించాలి. ప్రజాసేవలో ఆరోగ్యకరమైన పోటీనిరంగంలోకి తేవాలి. ప్రజలకు విద్య, ఆరోగ్య సేవల్ని మెరుగుపర్చడం, యువతకు ఉపాధినైపుణ్యాలు, ప్రజల మధ్య సయోధ్య పెంపొందించడం, స్థానిక సమస్యల మీద, గ్రామీణాభివృద్ధి మీద ప్రజల్ని ఏకం చేసి పరిష్కారాలను సాధించడం -పౌరసేవల్ని మెరుగుపర్చడం ద్వారా ప్రజాజీవనాన్ని మరింత సుఖప్రదం చెయ్యడం తదితర ప్రజా సమస్యల చుట్టూ ఈ కొత్త పార్టీ కార్యకలాపాలు తిరగాలి. సమాజ హితం కోసం రాజకీయాలన్న కొత్త అర్థాన్ని ప్రజల ముందుంచే విధంగా ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యకలాపాలు నిర్వహించబడాలి.

### డి) రాజకీయం లాభసాటి వ్యాపారం కాదు, నిబద్ధత గల పవిత్ర సామాజిక వ్యాసంగం కావాలి

ప్రస్తుత రాజకీయం పై స్థాయినుండి కిందిస్థాయి వరకు లాభసాటి వ్యాపారం అయింది. అవినీతి వివిధ స్థాయిలలో విపరీతంగా పెరిగిపోయిందని అందరూ అంగీకరిస్తున్నారు. అయితే ఏ రూపంలో అవినీతి ఉన్నా, దానికి మూల కారణం రాజకీయంలోని లోపం. నేటి వికృత రాజకీయంలో అక్రమ నిధుల కోసం అంతులేని గిరాకీ ఉంది. కోటానుకోట్లు ఖర్చు, ఆర్భాటం లేకుండా రాజకీయాన్ని నిర్వహించటం నేటి ప్రధాన పార్టీలకి అసాధ్యం. డబ్బుతో నిరంతరం ముడిపడ్డ ఈ ధనరాజకీయానికి స్వస్తి చెప్పి, కొత్త రాజకీయాన్ని రూపొందించాలి. అందుకు ఈ కొత్త పార్టీ బాటలు వేయాలి. ఈ కొత్త పార్టీకి రాజకీయం ఒక నిబద్ధతగల వ్యాసంగం కావాలి. పార్టీలో అన్ని స్థాయిలలో ఇలాంటి నిబద్ధత గల నాయకత్వం వుండాలి. రాజకీయం ఒక సామాజిక కర్తవ్యంగా భావించి అంకితభావంతో పని చేసే కార్యకర్తలు వుండాలి. ఇలాంటి నిబద్ధత గల పార్టీ మాత్రమే కొత్త రాజకీయ సంస్కృతికి ప్రాతినిధ్యం వహించగలుగుతుంది. అందుకు తగిన విధంగా పార్టీని అన్ని స్థాయిలలో రూపొందించాలి.

### ఇ) లక్ష్యం నుండి వైదొలగకుండా స్వయం దిద్దుబాటుకు ఏర్పాట్లు

కొత్త రాజకీయ సంస్కృతి కోసం ఏర్పడే పార్టీ తన లక్ష్యాల నుండి వైదొలగకుండా వుండాలంటే దానిలో అన్ని స్థాయిలలో అంతర్గత ప్రజాస్వామ్యం వుండాలి. పెడధోరణులు తలెత్తితే చక్కదిద్దుకోగల స్వయం దిద్దుబాటు ఏర్పాటు వుండాలి. ఇలాంటి పార్టీయే నూతన రాజకీయ సంస్కృతి సాధనకు మూల స్తంభంగా వుంటుంది. ఇలాంటి పార్టీయే సమస్యలో భాగంకాకుండా పరిష్కారంలో భాగం కాగలుగుతుంది. ఇలాంటి పార్టీయే ప్రస్తుత సంధిదశ నుండి రాజకీయ వ్యవస్థ బయట పడటానికి మార్గదర్శి కాగలుగుతుంది.

ఇలాంటి పార్టీయే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి తగిన ప్రత్యామ్నాయాన్ని అందించగలుగుతుంది.

నూతన రాజకీయ సంస్కృతిని సాధించడం కోసం ఇలాంటి నిబద్ధతగల రాజకీయపార్టీని రూపకల్పన చెయ్యడం అసాధ్యం కాదుగానీ, ప్రస్తుత పరిస్థితులలో కష్టతరమైంది. అయినా ఇలాంటి ప్రత్యామ్నాయ శక్తిని రూపొందించడం ఈనాటి చారిత్రక అవసరం. ఎంతటి కష్టతరమైంది అయినా ఇలాంటి చారిత్రక బాధ్యతను మంచి రాజకీయాన్ని కోరేవారంతా స్వీకరించాలి.

# V లోక్‌సత్తాపార్టీ ప్రత్యేకతలు-ఎజెండా

## 1. లోక్‌సత్తా పార్టీ - కొత్త తరహా పార్టీ

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు పాలకులు సేవకులు మాత్రమేనన్నది లోక్‌సత్తా నినాదం అయినట్లే, లోక్‌సత్తా పార్టీలో క్రియాశీల సభ్యులు విధాన రూపకర్తలుగా - నాయకులు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు.

**ఎ) లోక్‌సత్తా పార్టీ సభ్యుల పార్టీ :** ధన రాజకీయాన్ని జనరాజకీయం చెయ్యడానికి నిబద్ధతగల క్రియాశీల సభ్యుల పార్టీగా వుంటుంది. ఈ మేరకు క్రియాశీల సభ్యులకు విధిగా రాజకీయ శిక్షణ వుంటుంది. ప్రవర్తనా నియమావళి నిర్దేశింపబడింది. క్రియాశీల సభ్యులు విధిగా పార్టీ కార్యకలాపాలలో పాలు పంచుకోవాలి. పార్టీకి తన ఆదాయంలో కొంత శాతం విరాళంగా ఇవ్వాలి. లోక్‌సత్తా పార్టీ పూర్తిగా సభ్యుల మీద ఆధారపడే పార్టీగా వుంటుంది. నిబంధనావళి ప్రకారం గ్రామ/వార్డు స్థాయి శాఖల నాయకత్వాన్ని అందరు సభ్యులూ ఎన్నుకుంటారు. మండల/పట్టణ స్థాయి, నుండి జాతీయస్థాయి వరకు సమన్వయకర్తల్ని పార్టీ క్రియాశీల సభ్యులంతా ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. సమన్వయకర్తలు పార్టీకి సారధులుగా వుంటారు.

**రీకాల్ పద్ధతి :** పార్టీ నాయకత్వ స్థానాలలో ఎంపికైన వారు సభ్యుల విశ్వాసాన్ని కోల్పోతే వారిని వెనక్కి పిలిచే పద్ధతిని నిబంధనావళిలో నిర్దిష్టంగా ఏర్పాటు చేశారు.

**బి) ప్రత్యేక ఎన్నికల అథారిటీ :** లోక్‌సత్తా పార్టీకి ప్రతి మూడేళ్ళకు సంస్థాగత ఎన్నికలు సకాలంలో సక్రమంగా నిర్వహించడానికి వీలుగా ఒక స్వయంప్రతిపత్తిగల ఎన్నికల అథారిటీని రాష్ట్రస్థాయిలో వివిధ స్థాయిలలో ఏర్పడతాయి.

పార్టీ కమిటీల నేతల ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా గడువు ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించే అధికారాన్ని ఈ ఎన్నికల అథారిటీ కలిగి వుంటుంది. మండల/పట్టణస్థాయి క్రియాశీల సభ్యుల నమోదు ఈ ఎన్నికల అథారిటీ చేపడుతుంది. సాధారణ, క్రియాశీల సభ్యుల జాబితాలను ఈ అథారటీ ఆధ్వర్యంలో తయారవుతాయి. ఆ జాబితాల ప్రాతిపదిక మీద పార్టీలో ఎన్నికలు జరుగుతాయి.

**రహస్యబాలట్ :** అన్ని స్థాయిలలో ఎన్నికలు రహస్యబాలట్ పద్ధతిలో జరుగుతాయి.

**సి) పార్టీలో స్వయందిద్దుబాటు ఏర్పాట్లు :** నూతన సంస్కృతికి అనుగుణంగా వ్యవహరించడానికి, అవాంఛనీయశక్తులు చొరబడకుండా చూడటానికి వీలుగా స్వయంప్రతిపత్తి గల క్రమశిక్షణ అథారిటీలు కూడా రాష్ట్రస్థాయినుండి మండల / పట్టణస్థాయి వరకు వుంటాయి. పార్టీ క్రియాశీల సభ్యుల మీద, నాయకత్వం మీద, ప్రజల నుండి, సభ్యులనుండి వచ్చే ఫిర్యాదులతోపాటు పత్రికలలో వచ్చే వార్తలను కూడా పరిగణనలోకి తీసుకుని విచారించి తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారాన్ని ఈ క్రమశిక్షణ అథారిటీలు కలిగివుంటాయి.

**డి) అభ్యర్థుల ఎంపిక సభ్యులదే :** ప్రజాప్రతినిధులుగా పోటీ చేసే అభ్యర్థులను ఆ ప్రాంతంలోని పార్టీ క్రియాశీల సభ్యులే ఎంపిక చేస్తారు. ఉదా॥ అసెంబ్లీకి పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థిని ఆ నియోజక వర్గంలోని క్రియాశీల సభ్యులు రహస్యబాలట్ ద్వారా ఎంపిక చేస్తారు. ఇదే పద్ధతి స్థూలంగా అన్ని స్థాయిలకు వర్తిస్తుంది. అయితే మహిళలు, బలహీనవర్గాలు, మైనారిటీలకు ప్రాతినిధ్యం కల్పించడానికి వీలుగా చేసే ప్రత్యేక ఏర్పాట్ల పరిధిలో ఈ ఎంపిక జరుగుతుంది.

**ఇ) సామాన్యుల పార్టీ :** పుట్టుకతో వివక్షతకు గురయ్యే దళితులు, మహిళలు, అలాగే బలహీనవర్గాలు ఆదివాసులూ, మైనారిటీలకు పార్టీలో నిర్ణయాధికారం వుండేలా నిబంధనావళిలోనే ఏర్పాట్లు జరిగాయి. పార్టీ విధాన నిర్ణయాలు చేసే జనరల్ కౌన్సిలు, వర్కింగ్ కమిటీలలో మూడోవంతు స్థానాలను మహిళలకు, మరో మూడోవంతు స్థానాలను ఇతర బడుగు వర్గాలకు నిర్దిష్టమైన కేటాయింపు వుంది.

**ఎఫ్) యువతరం పార్టీ:** కొత్త తరానికి కొత్త రాజకీయం అన్న నినాదాన్ని ఆచరణలో పెట్టడానికి వీలుగా పార్టీ జనరల్ కౌన్సిల్ లో 50 శాతం స్థానాలు విధిగా 40 ఏళ్ళు లోపువారికి దక్కేలా ఏర్పాటు వుంది. ఒకవేళ జనరల్ కౌన్సిలులో అలాంటి వారు తగిన సంఖ్యలో ఎన్నిక కాకపోతే ఎన్నికైనవారిలో ఎక్కువ వయస్సుగలవారు ఆహ్వానితులుగా పరిగణింపబడి ఆ స్థానాలలో యువతకు అవకాశం కల్పించాలని పార్టీ నిబంధనావళిలో నిర్ధేశించబడింది.

## 3. లోక్‌సత్తా పార్టీ ఎవరి కోసం

- ➔ విద్యా, ఉపాధి అవకాశాలు అందుకోలేక నిరాశతో ఎదురు చూస్తున్న యువతరం కోసం...
- ➔ పుట్టుకతో ఎవరైతే వివక్షకు గురి అవుతూ సమాజంలో ఎదిగే అవకాశాలు శాశ్వతంగా కోల్పోతున్నారో, ఆ దళితులు, బలహీనవర్గాల కోసం...
- ➔ సమాజంలో సగభాగంగా వుంటూ, పుట్టుకకు ముందు, పుట్టిన తర్వాత కూడా సమాన హక్కులు, అవకాశాలు పొందలేక పోతున్న మహిళలు కోసం...
- ➔ రాజకీయం కుళ్ళిపోయిందన్న నిరాశతో రాజకీయాలకి దూరమైన ప్రజానీకం కోసం...

## 4. లోక్‌సత్తా పార్టీ ఎందుకోసం

- ➔ పుట్టిన ప్రతిబిడ్డకి కులంతో, డబ్బుతో/నిమిత్తం లేకుండ ఎదిగే అవకాశాన్ని కల్పించడం కోసం, ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందించడం కోసం...
- ➔ అందరికీ అందుబాటులో వైద్యసేవలు అందించడం కోసం...
- ➔ యువతకు ఉపాధి నైపుణ్యాలను అందించడం కోసం...
- ➔ వ్యవసాయ అభివృద్ధి కోసం, గ్రామీణ ప్రాంతాల ఆదాయాలను పెంచడం కోసం...
- ➔ పేదలకు స్వంత ఆస్తి కల్పించటం కోసం...
- ➔ పట్టణాలు, నగరాలలో (ప్రత్యేకించి పేదలు నివసించే ప్రాంతాల్లో) మౌలిక వసతుల కల్పన కోసం ...
- ➔ ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచటం కోసం...
- ➔ మహిళల అభ్యున్నతి కోసం...
- ➔ అసంఘటిత కార్మికుల అభివృద్ధి కోసం...
- ➔ శాంతిభద్రతలు గల సురక్షిత సమాజం కోసం...
- ➔ ఉన్నవాడికోన్యాయం, లేనివాడికోన్యాయం అన్న దాన్ని తొలగించడం కోసం...
- ➔ ప్రతి జిల్లాకి ఒక స్థానిక ప్రభుత్వం - రాష్ట్ర బడ్జెట్ లో జిల్లాల వారీ కేటాయింపులు
  మండలాలకి, పట్టణాలకి, గ్రామాలకి అధికారాలు, నిధులు, సిబ్బందిగల స్థానిక ప్రభుత్వాలు సాధించడం కోసం...
- ➔ లక్షలాది కుటుంబాలను నాశనం చేస్తున్న మద్యపానాన్ని కఠినంగా నియంత్రించడం కోసం...
- ➔ అవినీతి లేని పారదర్శకమైన, జవాబుదారీతనం గల సుపరిపాలన సాధించడం కోసం...
- ➔ ధనబలం, కండబలం ప్రమేయం లేని నిజమైన ప్రజాస్వామ్యం కోసం...

# VI నాయకత్వం

# మంచి నాయకత్వాన్ని అందించాలి

ప్రతీ సమూహానికి, సమాజానికీ నాయకత్వం తప్పనిసరి అవసరం. నాయకత్వం లేని సమూహం తన అవసరాలకు తగిన లక్ష్యాలను నిర్దేశించుకోలేదు. ఒక పక్షులగుంపును ముందుండి నడిపే పక్షి వుంటుంది. ఒక పశువుల మందను నడిపే పశువు ఒకటి వుంటుంది. అలాగే పక్షులకు, పశువులకు ఎన్నికలు వుండవు. పదవులు వుండవు. కాని నాయకత్వం వుంటుంది. ఒక సమాజానికి, సమూహానికి ఇలాంటి సహజ నాయకత్వం అవసరం.

తన సమూహపు ఆకాంక్షల్ని బాగా వ్యక్తీకరించడం ద్వారా సమూహం విశ్వాసాన్ని నమ్మకాన్ని ఆ పక్షి చూరగొంటుంది. అందుకే దాని వెంట మిగతా పక్షులుంటాయి. ఈ సమూహపు ఆకాంక్షలకు ఒక లక్ష్యాన్ని, గమ్యాన్ని నిర్దేశించి దానికి ముందుండి మొత్తం గుంపును నడిపిస్తుంది. నాయకత్వం ఎన్నికల నాయకత్వం కాదు. పదవులవేట నాయకత్వం కాదు, సామాజిక నాయకత్వం. ఇలా దారి చూపేవారు లేకపోతే సమాజం గుడ్డిదైపోతుంది. సమాజం మార్పు సాధించలేక కొట్టుమిట్టాడుతుంది.

మనం ప్రస్తుతం చూస్తున్న రాజకీయ నాయకత్వం ఇలాంటి సహజ సిద్ధమైందికాదు. సమాజహితం కోసం ఏర్పడింది కాదు. ఇది కృత్రిమ నాయకత్వం. ఈ కృత్రిమ నాయకత్వం సమూహపు ఆకాంక్షలను వ్యక్తీకరించడం ద్వారా పుట్టిందికాదు. నాయకత్వం పొందడానికి తేలికగా రెచ్చగొట్టే భావోద్రేకాల మీద ఆధారపడుతున్నది. ప్రజల ఇష్టపూర్వకమైన నాయకత్వం కాదు, పదిమంది వందిమాగధుల్ని పోషించడం ద్వారా తెచ్చుకున్న నాయకత్వం.

వీళ్ళకి నాయకత్వం ఒక బాధ్యతకాదు, ఒక బిరుదు, ఒకహోదా. మంచి నాయకత్వాన్ని అందించడం ద్వారా పదవులు రావడం కాదు, పదవుల్ని కొనుక్కోవడం ద్వారా నాయకత్వాన్ని చేజిక్కించుకోవడం. సమాజం కోసం కష్టనష్టాలు భరించడం కాదు, తమ స్వార్థానికి సమాజాన్ని కష్టాల పాలు చేయడం. ప్రజల ప్రేమానురాగాలతో పొందే అధికారానికి బదులు రౌడీలు, కండబలంతో బలవంతంగా పొందే పెత్తనం. పదవిని ప్రజాసేవకు బదులుగా అక్రమ సంపాదనకీ, వందిమాగధుల పోషణకి వినియోగించుకోవడం. ఇదీ మనం చూస్తున్న వారిలో అత్యధికులు పోషిస్తున్న నాయకత్వ పాత్ర. ఇలాంటి కృత్రిమ నాయకత్వాన్ని కొత్తగా రాజకీయాలలోకి వచ్చేవారు అనుకరించకూడదు. నాయకత్వం ఒక సామాజిక బాధ్యతగా వారు నిర్వహించాలి. పదవి సమాజ సేవకే గాని స్వార్థానికి కాకూడదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు-నాయకులు ప్రభువులు కాదు. ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులు. ప్రజల సొమ్ముకు ధర్మకర్తలు. నీతినిజాయితీలతో ఇది ఒక సామాజిక బాధ్యతగా మంచి నాయకత్వాన్ని అందించాలి.

**నాయకత్వ బృందం :** ఒక గ్రామంలో వివిధ తరగతుల ప్రజలు వుంటారు. వివిధ ప్రాంతాలు, ఆవాసాలు వుంటాయి. వీరికి ఏదో రూపంలో నాయకత్వం వహిస్తున్న వారుంటారు. అలాంటివారిలో అత్యధికులను సమీకరిస్తే నాయకత్వ బృందం వెనువెంటనే రూపొందుతుంది. అలా కాకుండా ఒక్కరే యూకలిప్టస్ (జామాయిలు) చెట్టులా నిటారుగా ఎదిగి గ్రామానికంతటికీ నాయకత్వం ఇవ్వాలనుకుంటే అది తేలికగా సాధ్యంకాదు. ఒకవేళ సాధ్యం అయినా ఏదో ఒక సామాజిక అంతరాల గాలి బలంగా వీచిందంటే కుప్పకూలిపోతుంది. అందుచేత గ్రామానికి సుపరిపాలన అందించడానికి వివిధ తరగతుల, ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే సమర్థులైన వారిని గుర్తించి నాయకత్వ బృందంగా రూపొందించాలి. అది గ్రామంలో పెను మార్పులు సాధించడానికి తగిన శక్తిని కలిగిస్తుంది.

**కలిసి పనిచెయ్యడం :** మంచి నాయకత్వ బృందాన్ని రూపొందించుకోవడం ఎంత ముఖ్యమో, ఆ బృందం కలిసి పనిచెయ్యడం అంతముఖ్యం. ఇతరుల్ని, ఇతరుల అభిప్రాయలను గౌరవించడం మన అభిప్రాయాలలో వున్న లోటుపాట్లు సరిచేసుకోడానికి సిద్ధపడడం, సమిష్టిగా నిర్ణయాలు చెయ్యడం, కలిసి పనిచెయ్యడానికి మంచి ప్రాతిపదికలు అవుతాయి. విజయానికి కలిసి పనిచెయ్యడం తప్పనిసరి షరతు అన్న విషయాన్ని గుర్తించాలి.

**లక్ష్యం ముఖ్యం కావాలి :** ఈ నాయకత్వ బృందానికి పదవులు పొందడం, పోటీచెయ్యడం కంటే గ్రామాభివృద్ధికి కొత్త అర్థాన్ని, పంచాయితీపాలనకు కొత్త అర్థాన్ని ఇచ్చి కొత్త రాజకీయ సంస్కృతి కోసం చేసే ప్రయత్నం విజయవంతం కావడం ముఖ్యం. ఈ లక్ష్యసాధనకు అవసరమైతే బృందం బైటవారికి అవకాశం ఇవ్వడానికి సిద్ధపడాలి. అలాగే రిజర్వేషన్లు,

రొటేషన్ల వల్ల ఈ బృందంలో ముందు అనుకున్న వారికి అవకాశాలు రాకపోవచ్చు, ఇతరులకి అవకాశాలు ఇవ్వవలసిరావచ్చు. ఏమైనా లక్ష్యం ప్రధానం కావాలి, ఎవరు పోటీ చేశారన్నది ప్రధానం కాకూడదు. అలాంటి విశాలమైన ఆలోచనలలో మంచినాయకత్వాన్ని గ్రామానికి అందించాలి.

## VII గ్రామాలలో మంచి రాజకీయం
## మనం ఏం చెయ్యాలి?

లోక్‌సత్తా పార్టీకి మంచి ఎజెండా వుంది. అది ప్రజల జీవనాన్ని మార్చగలిగింది. ఈ ఎజెండా చుట్టూ గ్రామంలో చర్చ ప్రారంభం కావాలి. అది కార్యాచరణకు దారి తియ్యాలి. కొత్త రాజకీయం ద్వారా ఇలాంటి మార్పును ఆచరణలో సమగ్రంగా తెచ్చుకోవాలన్న తపన కలిగించాలి.

### I గ్రామానికి వర్తించే ముఖ్యమైన ఎజెండా అంశాలు

1. పాఠశాల విద్యను మెరుగుపర్చడం
2. ఆరోగ్యకేంద్రం/ఉపకేంద్రం/అంగన్‌వాడీల సేవలను మెరుగుపర్చడం
3. వ్యవసాయ ఆదాయాలను పెంచడం
   పశువైద్య సేవలు, కోఆపరేటివ్‌సేవలు, మార్కెటింగ్ సేవలు, వ్యవసాయం విజ్ఞాన విస్తరణ సేవలు మెరుగుపర్చడం
4. యువత కోసం.. నిరుద్యోగ యువతకు
   నైపుణ్యాల పెంపుదలకు అవకాశాలు; వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు
5. మహిళల కోసం...
   అందరికీ మరుగుదొడ్లు, తల్లుల ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు
   వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు
6. పేదల/చేతివృత్తుల స్థితిగతులు మెరుగుపర్చడం
   సంక్షేమ పథకాల అమలు, రేషన్‌షాపు, మద్యపాన నియంత్రణ
   అసంఘటిత కార్మికుల భద్రత
7. గ్రామ పంచాయితీ సేవలు మెరుగుపర్చడం ఎలా?
   సిటిజన్స్ ఛార్టర్లు, సమాచార హక్కు
   గ్రామాలలో పట్టణ సేవలు
8. ఓటర్ల జాబితాలు-చక్కదిద్దడం ఎలా?
9. పౌరహక్కులు, పోలీసు స్టేషన్‌లో సిటిజన్స్ ఛార్టర్ల అమలు
   కోర్టులు, కేసులు... అత్యాచారాలు వగైరా

### II సభ్యులతో బృందాలు

లోక్‌సత్తా పార్టీ శాఖ ఏర్పడిన గ్రామంలో రాజకీయ చర్చ స్వభావం మారితీరాలి. అందుకు తగిన విధంగా పార్టీశాఖ, సభ్యులు కార్యక్రమాలను చేపట్టాలి.

ఒక గ్రామంలో లోక్‌సత్తా పార్టీలో చేరిన సభ్యులను సమావేశపర్చాలి. ఎజెండాలోని ఒక్కొక్క అంశంమీద ఆసక్తిగల పార్టీ సభ్యులను ఒక బృందంగా రూపొందించాలి. ప్రతి బృందానికి ఒక బాధ్యుణ్ణి నియమించుకోవాలి. అంతమంది సభ్యులు లేకపోతే ఒక్కొక్కరు ఒక్కొక్క ఆసక్తిగల అంశానికి బాధ్యత తీసుకోవాలి.

ఈ బృంద సభ్యులు వేరుగా కూర్చుని వాటికి బాధ్యత తీసుకున్న అంశానికి సంబంధించిన అన్ని వివరాలు, వాటి నియమనిబంధనలు సేకరించుకోవాలి. ఆ రంగాన్ని మెరుగుపర్చడానికి వున్న అవకాశాలను పరిమితులను నిర్ధారించుకోవాలి. వున్న పరిమితులలో మెరుగుపర్చే అంశాలపై ఒక ప్రణాళికను రూపొందించుకోవాలి.

## III చర్చను విస్తృత పర్చాలి

మన ఊళ్ళో పాఠశాలని మెరుగు పర్చడానికి ఏం చెయ్యాలి? లేదా ఆరోగ్య సేవల మెరుగుదలకు ఏం చెయ్యాలి? వ్యవసాయ ఆదాయం పెంపుదలకు ఏం చెయ్యాలి?

ఇలా ఎజెండాలోని ఏదో ఒక అంశాన్ని తీసుకుని ఆ అంశంమీద గ్రామంలో ఆసక్తిగల వారిని గుర్తించి వారితో చర్చించాలి. ఇలా గ్రామంలో పదిమందిలో యీ చర్చను విస్తృత పరచాలి. ఈ చర్చలో పాల్గొన్న బృందం అధికార యంత్రాంగంలోని వారితో ఇలాంటి చర్చను కొనసాగించాలి. మెరుగుదలకు వున్న అవకాశాలను మార్గాలను నిర్ధారించుకోవాలి. ఈ ఎజెండా అంశంవల్ల లబ్ది పొందే వారితో చర్చను మరింత విస్తృత పర్చాలి. వారిని భాగస్వాముల్ని చెయ్యాలి. ఉన్న పరిమితుల పరిధిలో తేలికగా పరిష్కారం అయ్యే అంశాలను తీసుకుని ఒక్కొక్క అడుగు ముందుకు వెయ్యాలి. ఇది ఏదో మన పార్టీ సాధించిన విజయంగా కాకుండా ఆసక్తిగల వారు, ప్రజలు, అధికార యంత్రాంగం అంతా కలిసి సాధించిన ఉమ్మడి విజయంగా దానికి ప్రచారం కల్పించాలి.

## IV కొనసాగింపు ఏర్పాట్లు

సాధించిన విజయాలను నిలబెట్టుకోడానికి కొనసాగించడానికి తగిన పౌర కమిటీలను ఏర్పాటు చేయాలి. లోక్‌సత్తా పార్టీ సభ్యులు ఇక్కడ పదవుల చుట్టూ తిరగకుండా ఇతరుల్ని కలుపుకు పోవడానికి పూనుకోవాలి. పార్టీ సభ్యులు తీసుకునే క్రియాశీల పాత్ర మాత్రమే తగిన గుర్తింపునిస్తుంది.

## V గుర్తుంచుకోవలసిన అంశాలు

1. ఎజెండా అంశాలమీద పార్టీ సభ్యులను బృందాలుగా విభజించడం
2. ఆసక్తి గల వారిని కలుపుకుని, చర్చలను విస్తృతపర్చడం
3. అధికార యంత్రాంగాన్ని, లబ్దిపొందేవారినీ ఈ చర్చలో భాగస్వాముల్ని చెయ్యడం
4. ఉన్న పరిమితులలో సాధించగల మెరుగుదలకు అందరి సహకారంతో కృషి చెయ్యడం
5. ఈ ప్రక్రియ కొనసాగించడానికి పౌర బృందాలను రూపొందించడం

స్థూలంగా ప్రతి ఎజెండా అంశంమీద గ్రామంలో చర్చను ప్రారంభించి, కొనసాగించే ప్రక్రియకు కార్యాచరణ వుండాలి.

## VI ఏం చెయ్యకూడదు?

- వ్యక్తుల ప్రయోజనాల కోసం ఎలాంటి పైరవీలు చెయ్యకూడదు. అలా తన కోసం లేదా ఇతరుల కోసం ప్రయత్నాలు చేసిన వారి పై తగిన చర్య తీసుకోవాలి.
- ఇతర పార్టీలని, నాయకుల్ని నిందించడం, దూషించడం ఎట్టి పరిస్థితులలోనూ చెయ్యకూడదు. సమస్య, దానికి సరైన పరిష్కారం ఏమిటి అన్నదే చర్చనీయంశంగా చెయ్యాలి. రాజకీయ చర్చ వ్యక్తిగత విమర్శలకీ, కక్షలకీ దారితీసేదిగా ఒకరిమీద ఒకరు బురద చల్లుకునేదిగా వుండకూడదు. ఎదుట వారినుండి ఎలాంటి విమర్శలు వచ్చినా మన వివరణ మాత్రం సమస్య మీద పరిష్కారం మీద మాత్రమే వుండాలి.
- వివిధ పార్టీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ వుండాలని మనం కోరుకుంటున్నాం. ఏ పార్టీని మొత్తంగా చెడ్డదని భావించకూడదు. పార్టీ విధానాలలో చెడ్డవుంటే, పొరపాటు వుంటే మన విమర్శ ఆవిధానం మీద మాత్రమేనన్నది స్పష్టం అయ్యే విధంగా ప్రవర్తించాలి. ఇది విధానాల మధ్య సంఘర్షణ తప్ప వ్యక్తుల మధ్య సంఘర్షణ కాదనేదాన్ని మనం పదేపదే స్పష్టం చెయ్యాలి.
- ఎజెండా ఏ అంశంమీదనైనా ఒక బృందం చేసే కార్యక్రమాలు పార్టీశాఖకి ముందుగా తెలియజెయ్యాలి. పార్టీ సభ్యులంతా పరస్పరం సహకరించుకుని ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యాలి. వ్యక్తిగత బాధ్యతలు నిర్వహించాలిగాని వ్యక్తిగత ఒంటెద్దు పోకడలు వుండకూడదు.
- సమాచార హక్కు చట్టాన్ని వినియోగించేటప్పుడు నిర్దిష్టంగా కావలసిన సమాచారాన్ని కోరాలి. వేధించడం కోసం కోరుతున్నారనే భావన రాకుండా చూసుకోవాలి.
- ఉపాధ్యాయులు, అధికారులు, పోలీసులతో మర్యాదగా వ్యవహరించండి. సమస్యకున్న ప్రాధాన్యత, చట్టబద్ధత మీద ఆధారపడి సంప్రదించడం వల్ల ప్రయోజనం వుంటుంది.

✱✱✱